నేటి నుంచి యోగాలో ఉచిత శిక్షణ

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్‌లోని భవానీనగర్ మహిళా మండలి భవనంలో ఆదివారం నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో సిద్ధి సమాధి యోగా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న యోగా గురువు సద్గుణాచారి తెలిపారు. దీర్ఘకాలంగా పీడించే ఆస్తమా, అల్సర్లు, డయాబెటిక్, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, పక్షవాతం, ఊబకాయం, ఎలర్జీల నుంచి విముక్తి కలిగించే సాధనం సిద్ధ సమాధి యోగా అన్నారు.శిక్షణ తరగతుల్లో ఆసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, సమాధి, మెడిటేషన్, ఆహారపు అలవాట్లను నేర్పబడతామన్నారు. మరిన్ని వివరాలకు 93933 57033 సెల్‌నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

లింగోజిగూడ: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ ఫేజ్–2 కాలనీలో రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో కార్పొరేటర్ పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛంద సంస్థలు ఎప్పటికప్పుడు బస్తీల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శివ, స్వామి, మల్లేష్, జంగయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం ఏసీపీకి శుభాకాంక్షలు



ఏసీపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న భుజంగరెడ్డి

హస్తినాపురం: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వనస్థలిపురం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) గా బాధ్యతలు చేపట్టిన పల్లె కాశిరెడ్డిని శనివారం హైదరాబాద్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంరెడ్డి భుజంగరెడ్డి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్‌బీనగర్ ఏసీపీకి సత్కారం



ఏసీపీ కృష్ణయ్యను సన్మానిస్తున్న గౌడ సంఘం సభ్యులు

లింగోజిగూడ: సరూర్‌నగర్ గౌడ సంఘం సభ్యుడు శనివారం ఎల్‌బీనగర్ నూతన ఏసీపీ కృష్ణయ్య, సరూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కందింకంటి శ్రీధర్‌గౌడ్, సభ్యులు దూసారి ఆనంద్‌గౌడ్, సంపత్‌గౌడ్, కాకి గంగాధర్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా 'బచ్‌పన్' వార్షికోత్సవం



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

లింగోజిగూడ: కొత్తపేట డివిజన్ పరిధిలోని బచ్‌పన్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం కొత్తపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బచ్‌పన్ పాఠశాల తెలుగు రాష్ట్రాల రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది రూపారెడ్డి , కౌషిరెడ్డి, జితేంద్ర దేవి తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో అమోలిక సిల్క్ షోరూం

ముషీరాబాద్: వస్త్ర వ్యాపారంలో పేరొందిన అమోలిక సిల్క్ తన రెండో బ్రాంచ్ రాంనగర్‌లోని టీఆర్‌టీ కాలనీలో శ్రీనివాస బట్టల దుకాణం లైన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ యజమాని సీ.హెచ్.శ్రీకాంత్, నేష్‌లు మాట్లాడుతూ.. కంచిపట్టు చీరలు, ఫ్యాన్సీ చీరలు, పట్టుపావడాలు తమ షోరూమ్ ప్రత్యేకం అని రూ.299 నుంచి రూ.లక్ష వరకు చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కారులోని నగదు చోరీ డ్రైవర్ పనే !

● రూ. 9 లక్షలు స్వాధీనం

మలక్‌పేట: కారు డిక్కీలోని రూ.9 లక్షలు మాయం కేసును మలక్‌పేట పోలీసులు ఛేదించారు. కారు డ్రైవరే ఆ డబ్బును కాజేసినట్టు గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ... శ్రీపురం కాలనీలో నివసించే వ్యాపారి రాజ్‌కుమార్ ఈనెల 15న తన కారు డిక్కీలో రూ. 9 లక్షలు ఉంచి శుభకార్యానికి వెళ్లాడు. అక్కడి నుంచి ఇంటికి తిరిగి వచ్చిన ఆయన కారులో పెట్టిన డబ్బును తీసుకోవడం మర్చిపోయాడు. కారును పార్కింగ్ చేసి ఇంట్లోకి వెళ్లిపోయాడు. మరుసటి రోజు కూడా వివిధ పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన ఆయనకు మధ్యాహ్నం సమయంలో నగదు విషయం గుర్తు వచ్చి కారులో వెతికితే కనపడలేదు. దీంతో శుక్రవారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన మలక్‌పేట పోలీసులు అతని వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్న బోడుపల్లి సురేంద్ర చారినే నగదు అపహరించినట్టు గుర్తించారు. నల్గొండ జిల్లా పీఏ పల్లి మండలం మల్లేపల్లికి చెందిన సురేంద్ర చారి ప్రస్తుతం సరూర్‌నగర్ తపోవన్ కాలనీలో నివసిస్తున్నాడు. అతని నుంచి పోలీసులు రూ. 9లక్షలు స్వాధీనం చేసుకొని నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు.

లక్ష్య సాధనకు నిరంతరం కష్టపడాలి



సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకిస్తున్న డాక్టర్ శ్రీనివాసశాస్త్రి తదితరులు

వనస్థలిపురం: హస్తినాపురం వెంకటరమణ కాలనీలోని రవీంద్రభారతి పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో–2024 అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ ఆఫ్ స్పెషల్ ప్రాజెక్ట్, డీఆర్‌డీఓ డాక్టర్ శ్రీనివాస శాస్త్రి మాట్లాడుతూ, అత్యంత పేద కుటుంబంలో పుట్టి, కష్టపడి చదువుకుని, మిస్సైల్ మేన్‌గా ఎదిగి, దేశానికి రాష్ట్రపతి అయిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మనందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని దానిని చేరుకోవడానికి నిరంతరం కష్టపడాలన్నారు. తమ పరిశోధనల ద్వారా మానవాళి అభివృద్ధికి పాటుపడాలని, దేశానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలుగు యూనివర్సిటీ విశ్రాంత వీసీ ఎస్‌వీ సత్యనారాయణ, మెంబర్ ఆఫ్ ఎస్ఎల్‌పీఎస్ పి.చంద్రశేఖర్, అడ్మినిస్ట్రేషన్ జోనల్ ఇన్‌చార్జి కిషోర్, జోనల్ డీన్ జ్యోతి, ఇన్‌చార్జి దయాకర్, ప్రిన్సిపాళ్లు సూర్యనారాయణ, సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు నాణ్యమైన వైద్యం



సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ : పేదలు నాణ్యమైన వైద్య సేవలు పొందేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో దోహద పడుతోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ సాయినగర్‌కు చెందిన రహానే సుల్తానా కడుపు నొప్పితో ఇబ్బంది పడుతోంది. ఆపరేషన్ చేయించుకునేందుకు అవసరమైన డబ్బులు లేక పోవడంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. ఆయన సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించగా, రూ.లక్ష మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ (చెక్కు)ను శనివారం లబ్ధిదారు సుల్తానా కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో అనంతుల రాజిరెడ్డి, సాగర్, బంటి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్స్ ఎంప్లాయీస్ కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న థియేటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

వనస్థలిపురం: తెలంగాణ సినిమా థియేటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం వనస్థలిపురంలోని సంపూర్ణ థియేటర్‌లో నూతన సంవత్సర కేలండర్‌ను విడుదల చేశారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లారావు, సీఐటీయూ ఎల్‌బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్యలు కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సినిమా థియేటర్లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వంతో పాటు థియేటర్ల యాజమాన్యాలను కోరారు. కార్యక్రమంలో సంపూర్ణ థియేటర్ మేనేజర్ గోపాల్, సిబ్బంది వెంకటేష్, మహేష్, రాజు, యూసుఫ్, రవి, ఈశ్వర్, భాను, జంగయ్య, బహదూర్, శంకర్, శ్రీకాంత్, మురళి, ప్రకాష్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి ప్రదాత కేసీఆర్



కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రాజిరెడ్డి తదితరులు

చంపాపేట: తెలంగాణ రాష్ట్రాభివృద్ధి ప్రదాత కేసీఆర్ అని చంపాపేట డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం చంపాపేట, కర్మన్‌ఘాట్ చౌరస్తాల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి సందడి చేశారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. డివిజన్ పార్టీ నాయకులు రఘుమారెడ్డి, అంజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, తిరుమలేష్, రాజు, చందు, ఉమామహేశ్వర్, సరోజ, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

గడ్డిఅన్నారంలో...

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు జక్కుల శ్రీశైలం యాదవ్, నాయకులు బిచినేపల్లి వెంకటేశ్వరరావు, రమేష్ ముదిరాజ్, బాలాగౌడ్, రవిచారి, రవీందర్‌రెడ్డి, యాద శంకర్, కృష్ణ, ప్రదీప్, విక్కీ గౌడ్, నాగమణి, లక్ష్మి, ఉమ, స్వప్న, పద్మావతి పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న గడ్డిఅన్నారం బీఆర్‌ఎస్ నాయకులు

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రావు



నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్‌రావు

హుడాకాంప్లెక్స్: కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా వక్కలంక శ్రీనివాస్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహరెడ్డి శ్రీనివాసరావుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలన్నారు. అనంతరం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేసినందుకు పార్టీ తనకు పదవీ బాధ్యతలు అప్పగించి గౌరవించిందన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా తాను పని చేస్తానని తెలిపారు.

శ్రీశైలంలో ప్రేమజంట ఆత్మహత్య

శ్రీశైలం: శ్రీశైలంలోని ఓ వసతి సముదాయంలో నగరానికి చెందిన ఓ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకుంది. సీఐ ప్రసాదరావు తెలిపిన మేరకు.. హైదరాబాద్‌కు చెందిన మల్లేష్ (35), సరిత (28)లు ఈనెల 13న శ్రీశైలం వచ్చి స్థానిక ఓ వసతి సముదాయంలో గది అద్దెకు తీసుకున్నారు. వారు ఈనెల 15వ తేదీన ఖాళీ చేయాల్సి ఉండగా 17వ తేదీ ఉదయం వరకు నిర్వాహకులకు సమాచారం లేదు. అయినా సిబ్బంది పట్టించుకోలేదు. పక్క గదిలో బసచేసిన వారు..దుర్వాసన వస్తోందని ఫిర్యాదు చేయడంతో తలుపులు బద్దలుకొట్టి చూడగా గదిలో ఇద్దరూ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. మృతురాలి సరిత దగ్గర లభించిన ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ల ఆధారంగా ఆచూకీ గుర్తించి కుటుంబీకులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. సరూర్ నగర్‌కు చెందిన సరిత, శంకర్ దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. శంకర్ స్నేహితుడైన కార్పెంటర్ మల్లేష్‌తో సరితకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఏం జరిగిందో తెలియదు కానీ ఇద్దరూ శ్రీశైలం వచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అప్పటికే మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో సరిత మిస్సింగ్ కేసు నమోదవ్వడంతో అక్కడి పోలీసులు కూడా శనివారం సాయంత్రం శ్రీశైలం చేరుకున్నారు.

పెద్దమ్మ తల్లికి బోనాలు



పహాడీషరీఫ్: మామిడిపల్లి పెద్దమ్మ తల్లి బోనాలు శనివారం ఘనంగా నిర్వహించారు. భక్త కమిటీ సభ్యులు ఈరంకి విశ్వనాథ్ గౌడ్, లిక్కి విజయేందర్ రెడ్డి, రమేష్ గౌడ్, ఆదిల్ల సిద్ధు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ అమ్మవారి ఆలయాన్ని సీఐఎస్ఎఫ్ అధికారులు తొలగించేందుకు ప్రయత్నించడం తగదని వారు మండి పడ్డారు. ఆలయం జోలికొస్తే ఊరుకోమని వారు హెచ్చరించారు.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరి అరెస్ట్

చిక్కడపల్లి: చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గాంధీనగర్ పోలీసులు తెలిపారు. గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లం అనిరుధ్(21) తుకారంగేట్, ఎస్.బాబు అక్షయ్(24) మల్కాజిగిరికి చెందిన వారు వీరిద్దరు ఈనెల 14న సాయంత్రం 4.30 గంటల సమయంలో కవాడిగూడలోని సీజీఓ టవర్స్ మలుపు వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. ఓ వ్యక్తి దగ్గర పర్సు లాక్కొని మరోకరికి చేరవేశారన్నారు. శనివారం ఉదయం బన్సీలాల్‌పేట్ కమాన్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా.. నిందితులు పట్టుపడటంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 13, వంకాయ 15, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 25, క్యారెట్ 19, దొండ 45, ఆలు 21, ఉల్లి 19, గోకర 45, దోస 19, సొర 09, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 45, అర్వి 50, మునగ 45, చిలగడదుంప 60, బీట్‌రూట్ 19, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 40, కాప్సికమ్ 60. ఈ ధరలు ఆదివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఏసీపీ ఉమామహేశ్వర్ రావు బాధ్యతల స్వీకరణ

మహేశ్వరం: మహేశ్వరం జోన్ ఏసీపీగా ఉమామహేశ్వర్‌రావు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మహేశ్వరం, కందుకూరు, పహాడీషరీఫ్, బాలాపూర్ పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహేశ్వరం జోన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు. శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. సీఐ, ఎస్ఐలను సమన్వయం చేసుకుంటూ శాంతి భద్రతలకు భంగం కలగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్ విధానంతో పని చేస్తామన్నారు. మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యనారాయణలను నూతన ఏసీపీ మర్యాదపూర్వకంగా కలిశారు.

బహుజన సాహిత్యం విడుదల

కవాడిగూడ: బహుజన సాహిత్యాన్ని విస్తృతం చేసే కార్యక్రమాన్ని ప్రొఫెసర్లు, అధ్యాపకులు, టీచర్లు, బహుజన మేధావులు చేపట్టాలని రాజ్యసభ మాజీ ఎంపీ, బీసీసీఈ చైర్మన్ తూళ్ల దేవేందర్‌గౌడ్ కోరారు. గద్దర్ ప్రాంగణంలోని రవ్వాశ్రీహరి వేదికపై బీసీసీఈ ఇన్‌చార్జి ఇంద్రవెల్లి రమేష్ నిర్వహణలో 14బహుజన పుస్తకాలను ఆవిష్కరించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ తిరుమలి, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సింహాద్రి, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీమనోహర్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు బంగ్యా, భూక్యా, ప్రొఫెసర్ వెంకటేష్, దళిత నాయకులు జేబీ రాజు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, బీసీ ఉద్యమ నేత సమ్మయ్య, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్ తదితరులున్నారు.



సాహిత్యాన్ని విడుదల చేస్తున్న దేవేందర్‌గౌడ్

వైఎస్ హయాంలోనే గుడిసెవాసులకు పక్కా ఇళ్లు



సైదాబాద్ మండల కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

సైదాబాద్: మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే సింగరేణి కాలనీలో గుడిసెవాసులకు పక్కా ఇళ్లు కట్టించి ఇచ్చారని సీపీఐ సీనియర్ నాయకుడు శంకర్‌నాయక్ అన్నారు. 2007లోనే ఆయన సింగరేణి కాలనీలో 56 భవంతులలో 1792 వాంబే గృహాలను గుడిసెవాసులకు నిర్మించి ఇచ్చారని తెలిపారు. ఆ తర్వాత ఏ ప్రభుత్వం కూడా సింగరేణి కాలనీవాసుల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. మురికివాడలలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ ఆధ్వర్యంలో సైదాబాద్ మండల కార్యాలయం ముందు సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి కాలనీలో 30 ఏళ్లుగా నివసిస్తున్న గుడిసెవాసులకు ఆధార్, ఓటరు సహా అన్నిరకాల గుర్తింపు కార్డులు ఉన్నా.. అందరికీ మౌలిక వసతులు, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో వచ్చి వాగ్దానాలు చేసి పోవడం తప్ప సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. సింగరేణి కాలనీలో రాద్రీ సొసైటీ వారి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని వారు కోరారు. అనంతరం సింగరేణి కాలనీ సహా అన్ని మురికివాడల్లో సమస్యలు పరిష్కరించాలని వారు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఐ నాయకులు ఛాయాదేవి, అంజయ్య, యాదగిరి, చంద్రమోహన్, అమీనా, రూప్‌సింగ్ పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లు పూర్తి చేయండి



మూసీలోని శివాలయం పరిసరాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహ గుప్తా

చైతన్యపురి: ఫణిగిరి కాలనీలోని పురాతన శివాలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తిచేయాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా అధికారులను కోరారు. శనివారం మూసీ నదిలోని శివాలయాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నదిలోని శివాలయం వరకు భక్తులు వెళ్లేందుకు వీలుగా మెట్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. జాతర ఏర్పాట్లు 20 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, ఇంజినీరింగ్ ఇన్‌స్పెక్టర్ రత్నసాయి, రాంకీ ఇన్‌చార్జి రవి, జీహెచ్ఎంసీ జవాన్ గణేష్‌రెడ్డి, జాతర నిర్వాహకులు కృష్ణారెడ్డి, ప్రభు, రాకేష్, స్థానికులు కమల్ జీ, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వర దేవస్థాన కమిటీ చైర్మన్‌గా అల్లె కుమార్

మహేశ్వరం: మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వర దేవస్థాన కమిటీ చైర్మన్‌గా మహేశ్వరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అల్లె కుమార్‌ను నియమించినట్లు శనివారం ఆలయ దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారి మురళీ కృష్ణ పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులుగా ఎం రాకేశ్, ఎ రాకేశ్, ఎస్ కన్నయ్య, కె జగన్, ఎ సాయిలు, కె శ్రీశైలం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఆలయ చైర్మన్ అల్లె కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవక్షేత్రంలో ఒకటైన మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయానికి చైర్మన్‌గా ఎంపికవ్వడం గర్వంగా ఉందన్నారు. ఆలయ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలతో కలిసి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కాచంకు జన్మదిన శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ దయానంద్

చైతన్యపురి: టీఆర్‌ఎస్ ఎల్‌బీనగర్ మాజీ ఇన్‌చార్జి కాచం సత్యనారాయణ జన్మదిన వేడుకలు శనివారం జరిగాయి. వేడుకల్లో ఎమ్మెల్యే బొగ్గారపు దయానంద్ పాల్గొన్నారు. కేక్ కట్ చేసి కాచంకు శుభాకాంక్షలు తెలిపారు. కాచం ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తాధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్సీ ప్రారంభించారు. అనంతరం పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. హయత్‌నగర్ డీసీ తిప్పర్తి యాదయ్య, కాచం సాయి, రాంనరేష్, మహేందర్, పరమేష్ పాల్గొన్నారు.

ఇటుకతో తలపై మోది మహిళ హత్య

వడ్డీ డబ్బు చెల్లించమన్నందుకు దారుణం



లక్ష్మమ్మ (ఫైల్)

హస్తినాపురం: అప్పు తీర్చమన్నందుకు ఇటుకతో తలపై మోది మహిళను హత్య చేసిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం...నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన ఎరుకల లక్ష్మమ్మ (48) పోలీస్‌స్టేషన్ పరిధిలోని కమ్మగూడ గ్రామంలో భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటోంది. మృతురాలి మేనల్లుడు రాజు(29) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కమ్మగూడలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. రాజు తన అవసరాల నిమిత్తం లక్ష్మమ్మ దగ్గర కొంత డబ్బు అప్పు తీసుకున్నాడు. అయితే, కొంత కాలం తర్వాత అసలు చెల్లించాడని, వడ్డీ రూ.10 వేలు చెల్లించాలని లక్ష్మమ్మ శనివారం సాయంత్రం రాజును డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తీవ్ర ఆగ్రహానికి గురైన రాజు పక్కనే ఉన్న ఇటుకతో లక్ష్మమ్మ తలపై బలంగా కొట్టాడు. తీవ్రగాయం కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.